సాక్షి
వైఎస్సార్ జిల్లా

బుధవారం । 5 । మార్చి । 2025



వ్యక్తిత్వ వికాసానికి మార్గం.. రంజాన్ మాసం

మత గ్రంథాలు వ్యక్తిని ఉన్నతుడిగా తీర్చిదిద్దేందుకు ఎన్నో మార్గాలను సూచిస్తున్నాయి. సాటి మనిషి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొంటున్నాయి. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ॥ (సా॥)	సహర్ గురు॥ (ఉ॥)
కడప	6.29	5.14
పులివెందుల	6.31	5.19
ప్రొద్దుటూరు	6.30	5.18

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.1/21.0

జిల్లాలో మంగళవారం 21.0 – 38.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం శిక్షణ ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో ఫొటో, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, కొవ్వొత్తుల తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతకు శిక్షణలో ప్రాధాన్యతనిస్తామన్నారు. అభ్యర్థులు 18–45 ఏళ్లలోపుకలిగి ఉండాలని, ఈనెల 8వ తేదిలోగా తమను సంప్రదించాలని పేర్కొన్నారు. వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

10న జోన్-4 సమావేశం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీ పీటీడీ జై భీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న కడప జోన్–4 సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి కిరణ్, బుజ్జి వెల్లడించారు. మంగళవారం కడప నగరంలోని ఏపీఎస్ ఆర్టీసీ ఈడీ పైడి చంద్రశేఖర్‌రావును కలిసి ఈ మేరకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, సమావేశానికి ఈడీని, డీపీటీఓను, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆహ్వానించామన్నారు. ఈడీని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి సుధాకర్, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు ఉన్నారు.

రేపు కడపలో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు తమ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఇన్‌ఛార్జి దోనప్ప తెలిపారు. కలెక్టరేట్‌లోని ఓ బ్లాక్‌లో ఉన్న జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు టెక్నో డోమ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు, ఛానల్ ప్లే లిమిటెడ్ సంస్థలు హాజరవుతాయని పేర్కొన్నారు. ఆయా కంపెనీలో అసెంబ్లీ లైన్ ఆపరేటర్, సేల్స్ ఆఫీసర్, అసిస్టెంట్ మేనేజర్ తదితర ఉద్యోగాలకు 5వ తరగతి, టెన్త్, ఐటీఐ, డిగ్రీ, పీజీ చదివినవారు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ. 10–32 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతల ధృవపత్రాలు, ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

లైన్‌మెన్ల సేవలు ఎనలేనివి



విద్యుత్ సిబ్బందికి ఉత్తమ ప్రతిభా అవార్డును అందిస్తున్న ఎస్‌ఈ రమణ, తదితరులు

పులివెందుల రూరల్: విధి నిర్వహణలో లైన్‌మెన్ల సేవలు మరువలేనివని విద్యుత్ శాఖ ఎస్‌ఈ రమణ పేర్కొన్నారు. జాతీయ లైన్‌మెన్ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని స్థానిక విద్యుత్ డివిజన్ శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ సంస్థకు అత్యున్నత సేవలు అందించిన పులివెందుల వెస్ట్, టౌన్‌లో పనిచేస్తున్న లైన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి, లైన్‌మెన్ అంజిలకు ఉత్తమ ప్రతిభా అవార్డులను అందజేశారు.డివిజన్ ఇంజనీర్ ప్రసాద్ రెడ్డి, ఏడీఈలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లింగాల: లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం (ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ సత్యవతమ్మ తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ విద్యాలయాల్లో ప్రత్యేకంగా పేద, నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు గొప్ప అవకాశమన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను తమ విద్యాలయంలో చేర్పించాలన్నారు. ఇతర వివరాలకు దగ్గరలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో సంప్రదించాలని సూచించారు.

ఏపీ గురుకుల మైనార్టీ బాలుర పాఠశాలలో...

కడప ఎడ్యుకేషన్: కడపలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల (మైనార్టీ బాలుర)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పేతకంశెట్టి సోమ సత్యశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా సెలెక్ట్ అయిన తర్వాత ప్రవేశం పొందవచ్చని తెలిపారు. మైనార్టీ బాలురతోపాటు ఎస్సీ, ఎస్టీ బాలురు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 31లోగా https://aprs.apcffss.inద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 25వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. వివరాలకు 7780179446, 9059500193 నెంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

జల్ జీవన్.. పూర్తయితే నంబర్ వన్

వాటర్‌గ్రిడ్‌తో నీటి కష్టాలకు చెక్

- ప్రధాన జలాశయాల ద్వారా నీటి సరఫరా
- 1587 గ్రామాలకు రక్షిత నీరు
- జేజేఎం గ్రాంటు కింద రూ. 2785 కోట్ల మంజూరుకు ప్రతిపాదనలు





కడప సెవెన్‌రోడ్స్: గ్రామీణ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం సమకూర్చే నిధులతో వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని ఐదు ప్రధాన జలాశయాల నుంచి తాగునీటిని శుద్ధి చేసి పైపులైన్ల ద్వారా గ్రామాలకు సరఫరా చేస్తారు. ఈ మల్టీ విలేజెస్ స్కీమ్‌కు సంబంధించి సవరించిన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. జల జీవన్ మిషన్ కింద గ్రాంటు మంజూరై పనులు పూర్తయితే గ్రామీణ తాగునీటి కష్టాలు తప్పినట్లేనని అధికారులు భావిస్తున్నారు.

• ఏటా వేసవిలో గ్రామీణ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. సీపీడబ్ల్యూఎస్ లాంటి పలు పథకాలు ఉన్నప్పటికీ అవి పూర్తి స్థాయిలో ప్రజల అవసరాలను తీర్చలేకపోతున్నాయి. సాధారణ రోజుల్లోనే సమస్యలు తప్పడం లేదు. ఇక వర్షాలు లేక తీవ్ర కరువులు జిల్లాను చుట్టుముట్టిన సందర్భాల్లో పరిస్థితి చెప్పాల్సిన పని లేదు. తాగేందుకు గుక్కెడు నీరు లేక ప్రజలు,పశువులు అలమటించాల్సిన పరిస్థితులు జిల్లాలో ఉన్నాయి. ఇలాంటి సందర్భాల్లో ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయడం, బోర్ల డీపెనింగ్, మరమ్మతులు, వ్యవసాయ బోరు బావులు అద్దెకు తీసుకోవడం వంటి చర్యలు చేపట్టడం సర్వసాధారణంగా ఉంటోంది. మండల, జిల్లా పరిషత్, జిల్లా సమీక్షా కమిటీ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు పలుమార్లు ఈ విషయాన్ని ప్రస్తావించిన సందర్భాలు లేకపోలేదు.

వైఎస్ జగన్ హయాంలోనే..

కేంద్ర ప్రభుత్వ జలజీవన్ మిషన్ ద్వారా వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేయాలని వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భావించారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఈ విషయాన్ని పట్టించుకోలేదు. అటకెక్కిన వాటర్ గ్రిడ్ దుమ్ముదులిపి గ్రామీణ ప్రజలకు శుద్ధి జలం అందించాలని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రణాళికలు రూపొందించారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో సైతం ఆయన సమావేశమై నిధుల సమీకరణకు కృషి చేశారు. తాజాగా ఆ పథకం కార్యరూపం దాల్చనుంది. ఈ పథకం పూర్తిగా విజయవంతమైతే జిల్లాలో గ్రామీణ తాగునీటి సమస్య దాదాపు పరిష్కారమైనట్లేనని అధికారులు భావిస్తున్నారు.

నిధుల మంజూరుకు ప్రతిపాదనలు..

జిల్లాలోని 1587 గ్రామాల్లో ఉన్న 10,27,048 మంది జనాభాకు 0.9453 టీఎంసీల తాగునీటిని సరఫరా చేసేందుకు 2785 కోట్ల రూపాయలు అవసరం అవుతాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. సస్టైనబుల్ సోర్సెస్ ద్వారా ఈ మల్టీ విలేజ్ స్కీమ్ కోసం కేంద్ర ప్రభుత్వం జల జీవన్ మిషన్ కింద గ్రాంటు విడుదల చేయాలని అధికార యంత్రాంగం తమ ప్రతిపాదనల్లో కోరింది.

గండికోట రిజర్వాయర్

- మండలాలు: కొండాపురం, ముద్దనూరు, ఎర్రగుంట్ల, వీఎన్ పల్లె, పెండ్లిమర్రి, వల్లూరు, చింతకొమ్మదిన్నె, చెన్నూరు, కమలాపురం
- గ్రామాలు: 490
- ప్రజలు: 3,08,904 మంది
- గ్రాస్ కెపాసిటీ: 26.85 టీఎంసీ
- సరఫరా చేయాల్సింది: 0.3083 టీఎంసీ
- నిధులు: రూ. 743 కోట్లు

బ్రహ్మంసాగర్



- మండలాలు: కాశినాయన, బి.కోడూరు, పోరుమామిళ్ల, కలసపాడు, ఖాజీపేట, బ్రహ్మంగారిమఠం, మైదుకూరు,
- గ్రామాలు: 470
- ప్రజలు: 2,60,076 మంది
- గ్రాస్ కెపాసిటీ: 17.74 టీఎంసీ
- సరఫరా చేయాల్సింది: 0.2961 టీఎంసీ
- నిధులు: రూ. 661 కోట్లు

టీజీ సబ్సిడరీ రిజర్వాయర్




- మండలాలు: దువ్వూరు, చాపాడు, ప్రొద్దుటూరు, రాజుపాలెం
- గ్రామాలు: 107
- ప్రజలు: 95,300 మంది
- గ్రాస్ కెపాసిటీ: 2.13 టీఎంసీ
- సరఫరా చేయాల్సింది: 0.0892 టీఎంసీ
- నిధులు: రూ. 245 కోట్లు

మైలవరం



- మండలాలు: పెద్దముడియం, జమ్మలమడుగు, మైలవరం, ప్రొద్దుటూరు, రాజుపాలెం
- గ్రామాలు: 173
- ప్రజలు: 2,42,438 మంది
- గ్రాస్ కెపాసిటీ: 9.98 టీఎంసీ
- సరఫరా చేయాల్సింది: 0.1756 టీఎంసీ
- నిధులు: రూ. 381 కోట్లు

సోమశిల



- మండలాలు: గోపవరం, బద్వేలు, అట్లూరు, సిద్దవటం, ఒంటిమిట్ట
- గ్రామాలు: 347
- ప్రజలు: 1,20,330 మంది
- గ్రాస్ కెపాసిటీ: 78 టీఎంసీ
- సరఫరా చేయాల్సింది: 0.0761 టీఎంసీ
- నిధులు: రూ. 755 కోట్లు

ఉగాది పురస్కారం పోస్టర్ ఆవిష్కరణ

కడప కార్పొరేషన్: శ్రీ నవ్య కళానికేతన్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా ఉగాది పురస్కారం అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పిలుపునిచ్చారు. మంగళవారం తన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం నగర అధ్యక్షుడు సాయి హుస్సేన్ ఆధ్వర్యంలో ఈ అవార్డుల ప్రదానోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారికి ఉగాది పురస్కారాలు అందించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, కో ఆప్షన్ సభ్యులు జమీర్, సౌత్ జోన్ అధ్యక్షులు పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, కె. మాధవరెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఉగాది ఉత్సవ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

మహిళలు యోగాసనాలు అభ్యసించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: మహిళలు మానసికంగా, శారీరకంగా ధృడంగా ఎదిగేందుకు యోగా చాలా ఉపయోగపడుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి, స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం నగరంలోని నబీకోటలో ఉన్న మహిళా శక్తికేంద్రంలో అంగన్వాడీ వర్కర్లు, మెప్మా పరిధిలోని మహిళా సంఘాలకు యోగ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల్లో ఒత్తిడిని నివారించాలంటే యోగా ఉపయోగపడుతుందన్నారు. యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి పలు సూచనలు చేశారు. అనంతరం మహిళలచేత యోగాసనాలు చేయిస్తూ వాటి ప్రయోజనాలు, శాస్త్రీయ దృక్పథాన్ని వివరించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

రోడ్డు భద్రతా ఆంక్షలు కఠినతరం

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో రోడ్డు భద్రత చర్యల ఆంక్షలను మరింత కఠినతరం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్, కమిటీ చైర్మన్ శ్రీధర్ చెరుకూరితోపాటు ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, కమిటీ మెంబర్ కన్వీనర్ ఇంచార్జి డీటీసీ కె. ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన రహదారుల్లో డివైడర్లను బ్రేక్ చేసి వాహన ప్రమాదాలకు అవకాశం కల్పిస్తున్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలన్నారు. రియల్టర్లు, రాజకీయ ప్రమేయాలకు స్పందించకుండా రోడ్డు భద్రతా ఆంక్షలను కఠినతరం చేయాలన్నారు. ఇంజనీరింగ్ శాఖల వారీగా వారి సంబంధిత రహదారులపై తాజాగా జరిగిన ప్రమాదాలను విశ్లేషించి, వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాల్లో.. 108 వాహన సేవలు సకాలంలో అందేలా సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యా సంస్థల వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు, అలాగే ప్రతి పెట్రోల్ బ్యాంకులు, కమర్షియల్ కాంప్లెక్స్ ల వద్ద సీసీ కెమెరా లను ఏర్పాటు చర్యలు తీసుకోవాలన్నారు. అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, పరిమితికి మించి ఆటోలు నడపడం, బస్సులు ఇతర వాహనాలలో అధిక లోడుతో సరుకు, ఇతర సామగ్రి రవాణా చేసే వారిపై.. కఠిన చర్యలు తీసుకోవలసిందిగా రవాణ శాఖ అధికారులను ఆదేశించారు. అంతర్ జిల్లా సరిహద్దుల చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక దష్టి సారించి కేసులు ఫైల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కె. ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులు రెడ్డి, డీఎంహెచ్ఓ నాగరాజు, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు, కమిటీ సభ్యులైన రోడ్ సేఫ్టీ ఎన్జీవో, విద్యుత్ శాఖల ఎస్.ఈ.లు, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులు, ట్రాఫిక్, పోలీసు, రవాణా శాఖ అధికారులు, రోడ్డు భద్రత ఎన్‌జీఓల ప్రతినిధులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో ఎస్పీ

మాదకద్రవ్యాల నిరోధానికి పటిష్ట చర్యలు

మత్తుపదార్థాల వినియోగం, విక్రయాలు, రవాణాను అరికట్టడానికి జిల్లాలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీసీ హాలులో జిల్లాలో మత్తు పదార్థాల నివారణ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధంపై ఎస్పీ అశోక్ కుమార్, జేసీ అదితి సింగ్ లతో కలిసి కలెక్టర్ జిల్లా స్థాయి యాక్షన్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల మూల సరఫరా రవాణాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● చేతికందినంత...

మంత్రి అనుచరుల దందా!

ప్రొద్దుటూరు: శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని మహిళా మంత్రి అనుచరులు రైతుల ముసుగులో దోపిడీకి దిగారు. నాసిరకం కందులు తీసుకొస్తూ కోట్లు కొల్లగొడుతున్నారు. తాజాగా ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీ పరిధిలోని స్టేట్ వేర్ హౌసింగ్ గోడౌన్‌కు వచ్చిన 600 కందుల బస్తాలకుగాను 386 బస్తాలను నాఫెడ్ అధికారులు నాసిరకంగా ఉన్నాయని తిరస్కరించారు. మరో లారీలో 607 బస్తాలకు గాను 180 బస్తాలను వెనక్కి పంపారు. ఇలా ప్రతి లారీలో పెద్ద సంఖ్యలో నాసిరకం కందులు తీసుకొస్తూ రూ.కోట్లు కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్, రాష్ట్ర ప్రభుత్వ సంస్థ మార్క్‌ఫెడ్ ద్వారా ఈ ఏడాది మద్దతు ధర చెల్లించి రైతులతో కందులను కొనుగోలు చేస్తున్నారు. ఇందుకుగాను క్వింటాల్ కందులకు రూ.7,550 చెల్లిస్తున్నారు. కొనుగోలుకు సంబంధించి నాఫెడ్ పలు నిబంధనలు ఉన్నా అధికార పార్టీ నేతలు వీటిని ఖాతరు చేయలేదు.

వెనక్కి పంపుతున్న అధికారులు

రొద్దం ప్రాంతం నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో కందుల లోడ్ లారీలు ఇక్కడికి వస్తున్నాయి. పరిస్థితిని గమనించిన అధికారులు ప్రతి లారీకి సంబంధించి ప్రతి బస్తాను తనిఖీ చేస్తున్నారు. సగానికి సగం పుచ్చుపట్టిన కందులు రావడంతో వెనక్కి పంపుతున్నారు. విషయం తెలుసుకున్న సదరు వ్యాపారులు అక్కడి అధికార పార్టీ నేతలతో అధికారులకు ఫోన్ చేసి ఒత్తిడి చేస్తున్నారు. ఇలా చెడిపోయిన కందులను దించుకుంటే ముమ్ముందు తమ ఉద్యోగాలకు ముప్పు వాటిల్లుతుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో సోమవారం లారీలోని సరుకును దించాలని వ్యాపారులు ఒత్తిడి చేయడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. తమ లారీలు అన్‌లోడ్ చేయడం లేదని లారీ డ్రైవర్లు పోలీస్ స్టేషన్‌లోనే హల్ చల్ చేశారు.

అధికారుల తనిఖీ

విషయం తెలుసుకున్న తహసీల్దార్ గంగయ్య, ఆర్డీఓ ఎ.సాయిశ్రీతోపాటు త్రీటౌన్ సీఐ గోవింద రెడ్డి వేర్‌హౌస్ గోడౌన్‌కు వచ్చి కందులను తనిఖీ చేశారు. పరిస్థితిని గమనించి సత్య సాయి జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం గీత, వైఎస్సార్ జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం పరమల జ్యోతి వేర్ హౌసింగ్ గోడౌన్ వద్ద మకాం వేశారు. ఈ విషయంపై సత్యసాయి జిల్లా డీఎం విలేకరులతో మాట్లాడుతూ 1402 మంది రైతుల నుంచి కందులను సేకరించగా, ఇందులో 800 మందికి రూ.8కోట్ల 48 లక్షల 67వేల 425 చెల్లించామన్నారు. నాశిరకం కందులు వస్తున్న మాట వాస్తవమేనని, వీటిని రీ ప్రాసెస్ చేసుకుని తీసుకురావాలని వెనక్కి పంపుతున్నామన్నారు.



సత్యసాయి జిల్లా నుంచి ప్రొద్దుటూరుకు వచ్చిన కందుల లారీలు



నాసిరకంగా ఉన్న కందుల బస్తాలకు గుర్తులు వేస్తున్న అధికారులు

తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నారు

మంత్రి అనుచరులు రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు పుచ్చు పట్టిన కందులను కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ప్రభుత్వానికి అమ్ముతున్నారని సమాచారం. ఫిబ్రవరి నెల నుంచి ఇప్పటికే లారీల కొద్ది కందులను కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన కందులను స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీలోని గోడౌన్‌లో నిల్వ ఉంచుతున్నారు. నేరుగా రైతుల నుంచే ఈ కందులు కొనుగోలు చేశారా, ఎక్కడైనా గోడౌన్లలో నిల్వ ఉంచిన పాత కందులను తీసుకొస్తున్నారా అనే విషయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వెనక్కి పంపుతున్నాం

గోడౌన్‌కు వస్తున్న కందుల బస్తాల్లో ఎక్కువగా నాసిరకం ఉన్నాయి. ప్రతి బస్తాను చెక్ చేస్తున్నాం. కొంత కాలం గోడౌన్‌లో నిల్వ ఉంచి తర్వాత ప్రభుత్వం ప్రజలకు సరఫరా చేస్తుంది. అప్పుడు కందులు సరిగా లేకుంటే మేంబాధ్యత వహించాల్సి వస్తుంది. – వెంకటస్వామి, వేర్ హౌస్ గోడౌన్ మేనేజర్, ప్రొద్దుటూరు

ఇంగ్లిష్ పరీక్షలకు 743 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 18267 మంది విద్యార్థులకుగాను 17524 మంది హాజరుకాగా 743 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఇందులో జనరల్‌కు సంబంధించి 626 మంది, ఒకేషనల్‌కు సంబంధించి 117 మంది గైర్హాజరయ్యారు.

ఆర్టీపీపీలో జాతీయ భద్రత ర్యాలీ



ఆర్టీపీపీలో నిర్వహించిన భద్రత వారోత్సవాల ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు

ఎర్రగుంట్ల: జాతీయ భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం డాక్టరు ఎంవీఆర్ ఆర్టీపీపీలో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని ఆర్టీపీపీ సీఈ గౌరీపతి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఆర్టీపీపీలోని అగ్నిమాపక కేంద్రం నుంచి పరిపాలన విభాగం భవనం నుంచి నినాదాలతో సాగింది. ఈ సందర్భంగా ఆర్టీపీపీ సీఈ గౌరీపతి మాట్లాడుతు ఆర్టీపీపీ ఉద్యోగులు భద్రత, ఆరోగ్యం వాతావరణ తదితరం అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్మికులు పనులలో కచ్చితంగా హెల్మెంట్ ధరించాలన్నారు. ఎస్ఈలు, ఈఈలు, ఫ్యాక్టరీ మేనేజర్ సిద్ధయ్య, అసిస్టెంట్ సెక్రటరీ బాష, అసిస్టెండ్ కమాండ్ కృష్ణయ్య, ఆర్ఐ రమేష్, విజిలెన్స్ సీఐ నారాయణ యాదవ్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేలం పాట ద్వారా రూ.18.95 లక్షల ఆదాయం

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో సోమవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటల ద్వారా రూ 18.95 లక్షలు మఠానికి ఆదాయం వచ్చినట్లు మఠం మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు. పోలేరమ్మగుడి దగ్గర కొబ్బరికాయలు విక్రయించుకునేందుకు రూ. 3,62,000, కొబ్బరి చిప్పలు వసూలు చేసుకునేందుకు రూ.1,90,000, టీటీడీ వసతి గృహాల దగ్గర ఉన్న మరుగుదొడ్లు శుభ్రపరిచేందుకు రూ.5,06,000, పార్కు ఎదురుగా ఉన్న కామన్ మరుగుదొడ్ల నిర్వహణకు రూ.2,40,000, గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్ర సదనం దగ్గర ఉన్న మరుగు దొడ్ల నిర్వహణకు రూ.2,40,000, భక్తుల పాదరక్షలు భద్రపరుచుకునేందుకు రూ.1,77,000, డార్మిటరీ నిర్వహణ కోసం రూ. 1, 80,000 వేలం పాట ద్వారా ఆదాయం వచ్చినట్లు వివరించారు.

మహిళ ఆత్మహత్య

చక్రాయపేట : మండలంలోని సురభి దళితవాడలో పెద్దపాగ స్వాతి (23) అనే వివాహిత మంగళవారం మనస్థాపానికి గురై ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ ఐ కృష్ణయ్య తెలిపారు. మృతురాలి పిన్నమ్మ అంజనమ్మ ఫిర్యాదు మేరకు ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతురాలి భర్త శ్రీధర్ జీవనోపాధి నిమిత్తం కువైట్ దేశానికి వెళ్లేందుకు నిర్ణయించుకోగా, ఇది ఇష్టంలేక స్వాతి మనస్థాపం చెంది ఉరి వేసుకుంది. మృతురాలికి నలుగురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి..



ఆత్మహత్య చేసుకున్నగుర్తు తెలియని వ్యక్తి

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని ఎర్రగుంట్ల రోడ్డులో ఉన్న ఏకోపార్కు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పార్కు ఎదురుగా ఉన్న అటవీశాఖ స్థలంలో ఒక చెట్టుకు లుంగీని చుట్టుకొని అతను ఉరేసుకున్నాడు. స్థానికులు చూసి మంగళవారం పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్ఐలు మహమ్మద్‌రఫి, వెంకటసురేష్‌లు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడికి సుమారు 40 ఏళ్లు ఉంటాయని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సైకియాట్రీ కాన్ఫరెన్స్‌కు డాక్టర్ లాజర్ వేపరాల



కడప ఎడ్యుకేషన్ : థాయ్‌లాండ్‌లోని బ్యాంకాగ్‌లో ఎపిసిరస్ సైంటిఫికా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8,9 తేదీల్లో జరగనున్న వరల్డ్ న్యూరోసైన్స్ అండ్ సైకియాట్రి కాన్ఫరెన్స్–2025కు యోగివేమన విశ్వవిద్యాలయం సైకాలజీ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ వేపరాల లాజర్‌కు సంస్థ ఆర్గనైజింగ్ సెక్రటరీ నుంచి ఆహ్వానం అందింది. రెండు రోజుల సదస్సులో డాక్టర్ లాజర్ డెమోగ్రాఫిక్ వేరియబుల్స్‌కు సంబంధించి కోవిడ్–19కు గురై కోలుకున్న వ్యక్తుల క్షేమం, మానసిక ఆందోళన అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పిస్తారు. అంతర్జాతీయ సదస్సుకు వెళుతున్న డాక్టర్ లాజర్‌ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఫణితి ప్రకాష్ బాబు, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ అభినందించారు.

మాసూమ్ రోజేదార్..!

ఉపవాసదీక్ష చేపడుతున్న చిన్నారులు





ఖురాన్ పఠిస్తున్న చిన్నారులు

మదనపల్లె సిటీ : రంజాన్ మాసం ముస్లింలకు పరమ పవిత్ర మాసం. ఇస్లాం కాలమానంలోని 9వ నెల రంజాన్. ఈ మాసంలో ముస్లింలు 30 రోజుల పాటు ఎంతో నిష్ఠతో ఉపవాసదీక్షలు చేపడతారు. ఇందులో భాగంగా వేకువ జామున 4 గంటల సమయంలో అల్పాహారాన్ని స్వీకరిస్తారు. దీనిని 'సహరీ' అంటారు. అప్పటి నుంచి సాయంత్రం 6.30 వరకు ఎలాంటి ఆహార పానీయాలు సేవించకుండా ఉపవాసదీక్షను చేపడతారు. సాయంత్రం 6.30 గంటలకు ఖర్జూరంతో ఉపవాసదీక్షలు విరమిస్తారు. దీనిని ఇఫ్తార్ అంటారు. పెద్దలపై మాత్రమే ఉపవాసదీక్షలు విధిగా ఉండాలన్న నిబంధన ఉంది. మదనపల్లె పట్టణంలో 5 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాలలోపు చిన్నారులు కూడా ఉపవాసదీక్షను చేపడుతున్నారు. వారిని చూసిన ప్రతి ఒక్కరూ వారి దైవభక్తిని మెచ్చుకొని 'మాసూమ్ రోజేదార్'(ఉపవాసం ఉన్న అమాయక బాలలు) అని అంటున్నారు. ఇలాంటి పలువురు చిన్నారులు 'సాక్షి'కి కనిపించారు. వారిని పలకరిస్తే ఉపవాసదీక్షలను పాటించడం తమకెంతో సంతోషంగా ఉందని తెలిపారు.

రోజా ఉంటే పుణ్యమట



రంజాన్ నెలలో ఉపవాసం ఉంటే పుణ్యం అధికంగా వస్తుందని మా నాన్నమ్మ చెబుతుంది. ప్రతి సంవత్సరం రోజాలు ఉంటాను. నేను కూడా ఈసారి నెల ఉపవాసాలు ఉంటున్నా.

– మహమ్మద్ తాహీర్

నాకు ఎంతో ఇష్టం



రంజాన్ అంటే నాకు ఎంతో ఇష్టం. ఐదుపూటలా నమాజ్‌తో పాటు ఉపవాసాలు ఉంటాను. మంచి చెడు గురించి తెలుసుకుంటాను. ఆధ్యాత్మికంగా గడుపుతా.

– ఆలియా సుల్తానా

ఆకలి దప్పికలు గుర్తుకు రావు



రోజా ఉండటం గత ఏడాది నుంచి అలవాటు చేసుకున్నా. అల్లాపై భరోసాతో దీక్షలు చేస్తున్నప్పుడు ఆకలి, దప్పికలు గుర్తుకు రావు. ఎండలు అధికంగా ఉన్నప్పుడు కాస్త జాగ్రత్త పడితే చాలు. ఈ ఏడాది కూడా అన్ని రోజాలు ఉండాలనుకుంటున్నాను.

– షాకీర్

కుటుంబ సభ్యులతో కలిసి..



రంజాన్ నెల వచ్చిందంటే మా కుటుంబ సభ్యులందరూ ఉపవాసాలు ఉంటారు. వారితో పాటు నేను కూడా మూడేళ్ల నుంచి దీక్షలు పాటిస్తున్నా. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఏం తీసుకోను.

– సానియా ముస్కాన్

వ్యక్తిత్వ వికాసానికి మార్గం.. రంజాన్ మాసం



కడప కల్చరల్ : దాదాపు అన్ని మత గ్రంథాలు వ్యక్తిని ఉన్నతుడిగా తీర్చిదిద్దేందుకు ఎన్నో మార్గాలను సూచిస్తున్నాయి. ప్రతి మతం సాటి మనిషి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొంటున్నాయి. ముందు వ్యక్తిగా తాను స్వచ్ఛంగా, బలంగా నిలదొక్కుకోవాలని, తర్వాత ఆపన్నులను ఆదుకోవాలని చెబుతున్నాయి. పవిత్ర ఖురాన్‌లోని కొన్ని మాటలు, ప్రవక్త జీవితంలోని కొన్ని సంఘటనలు మానవ వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో తోడ్పడేలా ఉన్నాయి. కడప నగరానికి చెందిన ఇస్లాం ఆధ్యాత్మిక వేత్త హజరత్ హుసేనీ బాషా షహమీరి సాహెబ్ ఇలాంటి కొన్ని విశేషాలను అందజేస్తున్నారు.

పవిత్ర రంజాన్ మాసంలోని రోజాలు, దానికి సంబంధించిన ఆహార నియమాలు ఆరోగ్యపరంగానూ, మనసును అదుపు చేసుకునే విషయంలోనూ ఎంతో తోడ్పడతాయి. పొరుగువారి ఆకలి తెలుసుకునేలా చేసి సాటి మనిషికి సాయపడే గుణాన్ని అలవాటు చేస్తాయి. ఇవ్వడంలో ఉన్న తృప్తి ఏమిటో తెలియజేస్తాయి. తద్వారా అల్లాహ్‌కు దగ్గర చేస్తాయి. జిహ్వా చాపల్యమేగాక జిహ్వా చాంచల్యం కూడా మనిషిని ఇబ్బందులకు గురి చేస్తోందని పరోక్షంగా ఈ పండుగ సంప్రదాయాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా పరస్త్రీ వ్యామోహాన్ని సమూలంగా నిర్మూలించేందుకు తగిన ఆత్మ నిగ్రహాన్ని అందజేస్తున్నాయి.

దాన ధర్మాలు

ఈ పవిత్ర మాసంలో జకాత్, ఫిత్రాల పేరిట పేదలకు దానం చేసే సంప్రదాయం ఉంది. తమ సంవత్సర ఆదాయంలో సూచించిన మేరకు ధనాన్ని బంధుమిత్రుల్లోని పేదలకు ఇవ్వాల్సి ఉంటుంది. వారు ఆకలితో ఉంటూ పండుగను ఆస్వాదించలేరని, ఆకలి కడుపునకు భక్తి పట్టదని, అందుకే కనీసం పండుగ రోజైనా నిరుపేదలు కడుపు నిండా తినేందుకు జకాత్ ఇవ్వాలని పవిత్ర గ్రంథం ఖురాన్ సూచిస్తోంది. ఉన్నా లేకున్నా ఉన్నంతలో పండుగ సందర్భంగా జరిగే ప్రార్థనలకు ముందు ఫిత్రా పేదలకు అందజేయాలి.

అనుబంధాలు

రంజాన్ పండుగ అనుబంధాలను పెంచుతుంది. ఈ మాసంలో రోజా (ఉపవాసాలు) సందర్భంగా ఒకరికొకరు ఇఫ్తార్‌ను ఏర్పాటు చేసుకోవడం, ఒకరినొకరు తినిపించుకోవడం, ఆహార పదార్థాలను పంచుకోవడం, బంధుమిత్రులతో కలిసి ఉపవాస విరమణ దీక్షలు, ప్రార్థనలు చేయడం, వారితో అనుబంధాన్ని మరింతగా పెంచుతుంది. మునుపు కోల్పోయిన బంధాలను కూడా ఇలాంటి కార్యక్రమాల ద్వారా పునరుద్ధరించుకోవచ్చు. పండుగరోజు కూడా తాము చేసుకున్న ముఖ్యమైన ఆహార పదార్థాలను కొద్దిగానైనా బంధుమిత్రులకు అందజేసి వారితో మానసిక బంధాన్ని పెంచుకునే అవకాశం పవిత్ర రంజాన్ కల్పిస్తుంది. ముందు రోజులు, పండుగ రోజుల్లో తమ ప్రవర్తనను తాము తరిచి చూసుకుని ఆత్మ పరిశీలన చేసుకునేందుకు రంజాన్ మాసం ఉత్తమమైనదిగా పెద్దలు పేర్కొంటున్నారు. మనం ఇతరులు ఎలా ఉండాలని ఆశిస్తామో...ఇతరులు కూడా మన నుంచి అలాగే ఆశిస్తారని తెలుసుకునేందుకు ఈ పండుగ అవకాశం కల్పిస్తుంది.

ఇది మోసకారి బడ్జెట్

సదస్సులో వక్తలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాయలసీమ ప్రాంతానికి తీరని అన్యాయం చేసిందని, జనాభా ప్రాతిపదికన కానీ వైశాల్య ప్రాతిపదికన కానీ 42 శాతం కేటాయించాల్సిన బడ్జెట్‌లో 6 శాతం కేటాయించడం అంటే ఇది మోసకారి బడ్జెట్ అని వక్తలు విమర్శించారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర బడ్జెట్ - రాయలసీమ ఆకాంక్షలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అప్పుల బాహుబలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. గత బడ్జెట్‌తో పోల్చుకుంటే ఇది తక్కువేనన్నారు. ఈ రకమైన అర కొర బడ్జెట్ ద్వారా మరో 50 ఏళ్లు అయినా కూడా రాయలసీమలో ఏ ఒక్క ప్రాజెక్టు, ఏ ఒక్క పరిశ్రమ పూర్తి కాదన్నారు. రాయలసీమ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలంటే కనీసం రూ. 40 వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయన్నారు. అలాంటిది కేవలం రూ. 11 వేల కోట్లు రాష్ట్రమంతా కేటాయించడం ఎంతవరకు సమంజసమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి వారు చెప్పిన సూపర్ సిక్స్ హామీలే ప్రధాన కారణమని, అలాంటి హామీలను ఈరోజు విస్మరిస్తున్నారన్నారు. నిరుద్యోగ భృతికి ఈ బడ్జెట్‌లో తావు లేకుండా చేసి వారిని నిలువునా మోసం చేశారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి ఈ బడ్జెట్‌లో ఏ మాత్రం నిధులు కేటాయించలేదన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను ఈ బడ్జెట్ నిలువునా మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ తదితర పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్

- కొలిమిగుండ్ల మండలంలో జమ్మలమడుగు బస్సు బోల్తా
- కండక్టర్ సహా 15 మందికి గాయాలు



కల్వటాల వద్ద బోల్తా పడిన బస్సు

జమ్మలమడుగు : ఆర్టీసీ బస్సులో సురక్షిత ప్రయాణం అంటూ ఇటీవల భద్రతావారోత్సవాలను పూర్తి చేశారు. అయితే ఈ సూత్రం ఆర్టీసీలో అమలు కావడం లేదనేందుకు ఈ సంఘటనే ఉదాహరణ. జమ్మలమడుగు డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వేగంగా వాహనం నడిపి కొలిమిగుండ్ల మండలం కల్వటాల గ్రామ సమీపంలో స్పీడ్ బ్రేకర్‌ను ఎగిరించి కల్వర్టును గుద్దాడు. దీంతో బస్సు పొలాల్లోకి వెళ్లి బోల్తా కొట్టింది. ఇందులో ప్రయాణం చేస్తున్న 15 మంది ప్రయాణికులతో పాటు ఆర్టీసీ కండక్టర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికుల కథనం మేరకు.. కొలిమిగుండ్ల మండలం హనుమంతగుండం వద్ద నుంచి డ్రైవర్ ఫోన్లో మాట్లాడుతూ వాహనాన్ని వేగంగా నడుపుతూ వెళ్లాడు. ఫోనులో మాట్లాడుతూ బస్సు నడపొద్దంటూ ప్రయాణికులు చెబుతున్నా ఏమాత్రం పట్టించుకోకుండా డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడిపాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పింఛన్ పేరుతో వృద్ధురాలికి మోసం

- ఏకంగా ఆమె ఇంటిని, స్థలాన్ని కాజేసేందుకు యత్నించిన టీడీపీ కార్యకర్త
- చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు
- కేసు నమోదు చేశారంటూ టీడీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం



బాధితురాలు రహమత్‌బీ



ఆత్మహత్యకు యత్నించిన టీడీపీ కార్యకర్త ఇమ్రానుద్దీన్

కడప అర్బన్ : కూటమి ప్రభుత్వం వచ్చింది. నీకు చెవుడుకు సంబంధించిన సర్టిఫికెట్‌తో పాటు పింఛన్ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి ఏకంగా వృద్ధురాలి ఆస్తిని కాజేసేందుకు కుట్ర పన్నిన టీడీపీ కార్యకర్త ఉదంతమిది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు టీడీపీ కార్యకర్తపై చీటింగ్ కేసు నమోదు చేశారు. తనపై కేసు నమోదు చేశారంటూ టీడీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. బాధితురాలు షేక్ రహమత్‌బీ (62) తన సోదరుడు నబీరసూల్‌తో కలిసి కడప తాలూకా పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి.

కడప నగరంలోని నబీకోట మరాఠీవీధిలో షేక్ రహమత్‌బీ (62) నాలుగున్నర సెంట్ల స్థలంలో మూడు సెంట్ల మేరకు ఉన్న ఇంటిలో నివాసం ఉంటోంది. మిగిలిన ఒకటిన్నర సెంట్ల స్థలం ఖాళీగానే ఉంది. ఆమెకు చెవుడు ఉండటంతో చిలకలబావి మంచాలరామయ్య వీధికి చెందిన షేక్ సుల్తాన్ ఇమ్రానుద్దీన్ అనే టీడీపీ కార్యకర్త ఇంటిని, ఖాళీ స్థలాన్ని కాజేయాలని పథకం రచించాడు. అనుకున్నట్లుగానే రహమత్‌బీకి చవుడు ఉన్నట్లు మెడికల్ సర్టిఫికెట్ ఇప్పిస్తానని గత ఏడాది జూన్ 12వ తేదీన రిమ్స్ ఆసుపత్రికి తీసుకుని వెళ్లాడు. అక్కడి నుంచి నేరుగా జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తీసుకెళ్లి ఇల్లు, ఖాళీ స్థలం ఉన్న మొత్తం నాలుగున్నర సెంట్లను తన పేరుతో జీపీ (జనరల్ పవర్ అటార్నీ) చేయించుకున్నాడు. రెండవ సారి షేక్ రహమత్‌బీని వేలిముద్ర వేసి రావాలని రిజిస్ట్రేషన్ ఆఫీసుకు తీసుకుని వెళ్లాడు. తన తల్లి గులాబ్‌జాన్‌కు, రహమత్‌బీ ఒకటిన్నర సెంట్ల స్థలాన్ని విక్రయించినట్లుగా ఏకంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ ఏడాది జనవరిలో తన ఇంటి ముందు ఖాళీ స్థలాన్ని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కొతలు వేస్తుండటంతో అనుమానం వచ్చిన రహమత్‌బీ ఎందుకు కొలుస్తున్నారని ప్రశ్నించింది. తరువాత ప్రొద్దుటూరులో ఉంటున్న రహమత్‌బీ సోదరుడు నబీరసూల్, తన బంధువులతో కలిసి వచ్చి విచారించారు. రహమత్‌బీ భర్త షేక్ జమాల్‌కు తాను అన్న కుమారుడినని సదరు టీడీపీ కార్యకర్త జీపీ లో పొందుపరిచినట్లు తెలిసింది. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి 5న షేక్ ఇమ్రానుద్దీన్ పేరుమీద ఉన్న జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీ.పీ)ని రహమత్ బీ, తన సోదరులతో కలిసి వెళ్లి రద్దు చేయించింది. కానీ ఒకటిన్నర సెంటు స్థలం మాత్రం టీడీపీ కార్యకర్త ఇమ్రానుద్దీన్ తన తల్లి గులాబ్‌జాన్ పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉండటంతో రహమత్‌బీ తనకు న్యాయం చేయాలని ఫిబ్రవరి 24న 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కడప తాలూకా సీఐ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో ఇమ్రానుద్దీన్‌ను పోలీస్ స్టేషన్‌కు రావాలని ఫోన్ చేసి పిలిచారు. పలుమార్లు పిలిచినా రాకపోవడంతో కడప తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఇమ్రానుద్దీన్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఇమ్రానుద్దీన్ విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే రిమ్స్‌కు తరలించారు. వృద్ధురాలికి మాయమాటలు చెప్పి ఆమె స్థలాన్ని తన తల్లి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకుందని కాదని సివిల్ తగాదాలో పోలీసులు ఎలా జోక్యం చేసుకుంటారని రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఇమ్రానుద్దీన్ విలేకరుల ఎదుట ప్రశ్నించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ సంఘటనపై కడప తాలూకా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. విచారించేందుకు పోలీస్ స్టేషన్‌కు రమ్మని పిలిస్తే అతను రాకుండా ఈ చర్యకు పాల్పడ్డాడని తెలిపారు.

ప్యాసింజర్ రైలు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈనెల 8వ తేదీ వరకు కుంభమేళాకు నడవాల్సి ఉన్న తిరుపతి–హుబ్లీ–తిరుపతి (57401/57402) ప్యాసింజర్ రైలును ఈనెల 15వరకు పొడిగించినట్లు కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. తిరుపతి–హుబ్లీ మధ్య 8 నుంచి 15వ తేదీ వరకు, హుబ్లీ–తిరుపతి మధ్య 9వ తేదీనుంచి 16వ తేదీ వరకు ఈ రైళ్లను రద్దు చేశారన్నారు. తిరిగి 15, 16 తేదీలనుంచి ఈ రైళ్లు యథావిధిగా నడుస్తాయని ఆయన వివరించారు.

ఫార్మసిస్టులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కడప కార్పొరేషన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఫార్మసిస్టులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల సురేష్ బాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతి మెడికల్ స్టోర్‌లో ఫార్మసిస్ట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. కానీ మెడికల్ స్టోర్‌లో అర్హత లేని సిబ్బందితో మందులు ఇప్పిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పలుమార్లు ఈ విషయమై సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా క్వాలిఫైడ్ ఫార్మసిస్ట్ ప్రతి మెడికల్ స్టోర్‌లో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అప్పుడే డ్రగ్ మాఫియాను అరికట్టవచ్చన్నారు.

కారుబోల్తా



ముద్దనూరు : ముద్దనూరు–కడప జాతీయ రహదారిలో తిమ్మాపురం సమీపంలో ప్రమాదవశాత్తు కారు బోల్తాపడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు తాడిపత్రి నుంచి ప్రయాణిస్తు కారు టైరు పగిలి అదుపుతప్పలేక రహదారి పక్కకు వెళ్లి బోల్తాపడింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు సహాయం అందించారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రవేశ పరీక్షతో ఉజ్వల భవిష్యత్తు



అధ్యాపకులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్ : దేశవ్యాప్తంగా జరిపే సెంట్రల్ యూనివర్సిటీ అండర్ గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్ష–2025 (సీయూఈటీ అండర్ గ్రాడ్యుయేట్ 2025)తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కడప ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. దేశంలోని 190కి పైగా సెంట్రల్ యూనివర్సిటీలు, స్టేట్ యూనివర్సిటీలు, ప్రైవేటు డీమ్డ్ టు బీ యూనివర్సిటీలలో, ఐకార్ అనుబంధ వ్యవసాయ కళాశాలలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో ప్రవేశం కోసం జరిపే ఈ పరీక్ష ద్వారా విద్యార్థులకు ఉన్నతమైన భవిష్యత్తు ఉంటుందన్నారు. మంగళవారం కడప ఆర్ట్స్ కళాశాలలో సర్ సీవీ రామన్ సైన్స్ క్లబ్, విద్యా భారతి ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను అధ్యాపకులతో కలిసి ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. ఈ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రారంభమైందన్నారు. మార్చి 22వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ కొనసాగుతుందన్నారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 7 గంటలకు ఆన్‌లైన్‌లో వెబ్‌నార్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా భారతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పత్తి వెంకట కృష్ణారెడ్డి, సైన్సు క్లబ్ గౌరవాధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు, గౌరవ సలహాదారు డాక్టర్ బి.రామచంద్ర, అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి, కార్యదర్శి విజయ ప్రసాద్, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, అధ్యాపకులు డాక్టర్ సావిత్రి, డాక్టర్ రవి, డాక్టర్ నీలయ్య, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, ఆటో కార్మికులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రోజువారి కష్టార్జితంపై ఆధారపడి జీవిస్తున్న ఆటో కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ నాయకుడు నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ అనుబంధ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు స్థానిక ఆర్టీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ అధిక వడ్డీలకు తెచ్చుకుని ఆటోలు నడుపుతున్న పేద వర్గాల పట్ల పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు పి.సుబ్బరాయుడు, ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కడప నగర అధ్యక్ష, కార్యదర్శులు పుల్లయ్య, నారాయణ, నగర నాయకులు సుబ్బరాయుడు, నాగిరెడ్డి, అంకుశం, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ పురోభివృద్ధిలో లైన్‌మెన్ల పాత్ర కీలకం

– కడప ఆపరేషన్ ఈఈ హరిసేవ్యా నాయక్



లైన్‌మెన్ దివస్ సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ్యా నాయక్

కడప కార్పొరేషన్ : విద్యుత్ శాఖ పురోభివృద్ధిలో లైన్‌మెన్ల పాత్ర ఎంతో కీలకమని కడప ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ్యా నాయక్ అన్నారు. మంగళవారం లైన్‌మెన్ దివస్ సందర్భంగా కడప డివిజన్ కార్యాలయంలో ఓ అండ్ ఎం స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి, కేక్ కత్తిరించి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా హరిసేవ్యా నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఆఫ్ ఇండియా లైన్‌మెన్లను ఫ్రంట్ లైన్ వర్కర్లుగా గుర్తించి 2021 సంవత్సరం నుంచి ప్రతిభ చూపిన లైన్‌మెన్లకు అవార్డులు ఇస్తోందన్నారు. జిల్లాలో ఉన్న లైన్‌మెన్లు కూడా ఈ అవార్డులు తీసుకునేందుకు పోటీ పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న యూనియన్ సభ్యులు, భారీ సంఖ్యలో ఎనర్జీ అసిస్టెంట్లు, జేఎల్ఎంలు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట ఆలయంలో పనులకు పురావస్తు శాఖ కొర్రీ

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండరామాలయంలో ధ్వజస్తంభం, బలిపీఠం, ఇత్తడి రేకు తొడుగు మార్పు పనులపై కేంద్ర పురావస్తుశాఖ అధికారులు నేటికీ అనుమతులు ఇవ్వలేదు. బుధవారం నుంచి మహా సంప్రోక్షణ ఉత్సవాలు జరగనుండగా పురావస్తు శాఖ జీర్ణోద్ధరణ పనులు పూర్తి చేసింది. అయితే ఒంటిమిట్ట రామాలయంలో ధ్వజస్తంభం, బలిపీఠం, స్వర్ణ రంగు పొయ్యి అందవికారంగా దర్శనమిస్తున్నాయి. దీంతో వాటిని అందంగా స్వర్ణ రంగుతో తీర్చిదిద్దేందుకు పురావస్తు శాఖ అనుమతులు వస్తాయనుకున్న టీటీడీ అధికారులు ధ్వజ స్తంభం చుట్టూ ఇనుప పైపులతో సారవ కట్టించారు. కానీ పురావస్తు శాఖ అనుమతులు రాలేదు.